గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బెల్లంపల్లి, జూన్ 28 : బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టీఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పొలిటికల్ సైన్స్-1, గణితం-1,ఇంగ్లిష్-1, తెలుగు-1, కంప్యూటర్-2 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో పీజీలో 55, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హతలు గల వారికి నియామక ప్రక్రియలో ప్రథమ ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. శనివారం లోపు కళాశాలలోని కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని సూచించారు.

ఐహెచ్ఆర్‌సీ జిల్లా కార్యదర్శిగా అజయ్

జన్నారం, జూన్ 28 : కిష్టాపూర్ గ్రామానికి చెందని పెండ్యాల అజయ్‌ని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫెడరేషన్ మంచిర్యాల జిల్లా ప్రదాన కార్యదర్శిగా ఎన్నికైనట్లు తెలిపారు. ఈ మేరకు జిల్లా ఐహెచ్ఆర్‌సీ జిల్లా అధ్యక్షుడు వీఎల్ రాజు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాతంగి హనుమయ్య నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘాన్ని బలోపేతం చేయడంతో పాటు పేదప్రజల పక్షాన పోరాటం చేసి వారి న్యాయం జరిగేలా చూడలని తెలిపారు.

పూడికతీత, ముళ్ల పొదలు తొలగించాలి

తాండూర్, జూన్ 28 : తాండూర్ పెద్ద చెరువు కాలువలు పూడిక తీత, చెట్ల పొదలను తొలగించాలని కోరుతూ శుక్రవారం రైతులు, నాయకులు తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఇక్కడ ఎంపీటీసీ శంకర్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఎండీ ఈసా, మదర్‌ఖాన్ హర్షద్, రైతులు ఉన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు 34 మంది హాజరు

నస్పూర్, జూన్ 28 : జిల్లా స్థాయి క్రీడా పాఠశాలల ఎంపికకు మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ఎంపికైన 34 మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్నారని జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి కీర్తి రాజ్‌వీరు తెలిపారు. రాష్ట్రంలోని మూడు క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో జిల్లా అధికారుల సంఘం అధ్యక్షుడు , ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గా ప్రసాద్, ఎంఈవో పోచయ్య, హెచ్ఎం సుధారాణి పాల్గొన్నారు. జిల్లా స్థాయి పోటీలకు 8 మండలాల నుంచి ఏడుగురు బాలికలు, 27 మంది బాలురు హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో పీడీ రాజయ్య, పరిమళ, రవి, యాకూబ్, గోపాల్, శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి, పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

కోర్టు పేషీలకు హాజరు కాని వ్యక్తి రిమాండ్

తాండూర్, జూన్ 28 : బైక్‌తో ఒకరిని ఢీ కొట్టి ప్రమాదానికి కారణమైన వ్యక్తి కోర్టు పేషీలకు హాజరుకాకపోవడంతో అతనికి రిమాండ్ విధించిన ఘటన తాండూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరు మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన పోషం 2018 ఏప్రిల్‌లో రేపల్లెవాడ వద్ద రోడ్డు పక్కన నిలిచి ఉండగా నరేశ్ అనే వ్యక్తి ద్విచక్రవాహనంతో అతడిని ఢీ కొట్టగా గాయాలయ్యాయి. ఈ కేసు విషయంలో నరేశ్ కోర్టు పేషీలకు హాజరు కానందున వారెంట్ జారీ కావడంతో తాండూరు ఎస్ఐ కిరణ్ కుమార్ అతడిని శుక్రవారం బెల్లంపల్లి కోర్టులో హాజరు పర్చారు. బెల్లంపల్లి జూనియర్ సివిల్ జడ్జి ముఖేశ్ అతనికి 14 రోజులు రిమాండ్ విధించారు.

బాధితుడికి ఆర్థిక సాయం

కన్నెపల్లి, జూన్ 28 : భీమిని మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన అంబిలపు సుధాకర్ ఇల్లు గురువారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైంది. శుక్రవారం పలువురు ఆర్థిక సాయం అందజేశారు. పీఏసీఎస్ వైస్ ప్రెసిడెంట్ ఆకుతోట రాజన్న రూ. 5 వేలు, వీగాం ఎంపీటీసీ కర్నె సుజాతశ్రీనివాస్ రూ. 5 వేలు, వెంకటాపూర్‌కు చెందిన నగేశ్ రూ. 5 వేలతో పాటు 50 కిలోల బియ్యం అందజేశారు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఆదివాసీ సంక్షేమ సేవా సంఘం కార్యవర్గం సమావేశం

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూన్ 28: ఆదివాసీ కొలవార్ సంక్షేమ సేవా సంఘం నూతన కార్యవర్గం సమావేశం నిర్వహించనున్నట్లు అఖిల భారతీయ ఆదివాసీ కులవార్ మన్నెవార్ సంక్షేమ సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు సుంకె కిష్టయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగజ్‌నగర్ మండలం వనవాస కల్యాణ పరిషత్ భవనంలో ఈ నెల 30వ తేదీన జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు నూతన కార్యవర్గం ఏర్పాటు కోసం సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంఘం నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూన్ 28 : ప్రభుత్వ షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ, ఆదిలాబాద్ ద్వారా 2024-25 సంవత్సరానికి అర్హులైన షెడ్యూల్ కులాల న్యాయశాస్త్ర పట్టభద్రుల నుంచి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడు సంవత్సరాల పాటు న్యాయపరిపాలన యందు శిక్షణ నిమిత్తం న్యాయాధికారికి జత చేయనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ప్రతి నెలా 3 వేల రూపాయల శిక్షణ భృతిని అందించడంతో పాటు, న్యాయశాస్త్ర గ్రంథాలకు, ఇతర ఫర్నిచర్ కొనుగోలు కోసం 50 వేల రూపాయలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. 39 సంవత్సరాలలోపు అర్హులైన షెడ్యూల్ కులాలకు చెందిన న్యాయశాస్త్ర పట్టభద్రులు EASS వెబ్ సైట్ https://telanganaepass.cgg.gov.in లో జూలై 6వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హులైన వారు సంబంధిత పత్రాలను జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ అధికారి, ఆదిలాబాద్ కార్యాలయంలో సమర్పించాలని అన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 6281510601ను సంప్రదించాలని సూచించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు

తాండూర్, జూన్ 28 : రైతులకు నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువులు ఎవరైనా అమ్మితే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి సురేఖ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో వ్యవసాయాధికారి గాదర్ల కిరణ్మయితో కలిసి బాలాజీ ఫర్టిలైజర్, సీతారామ మన అగ్రిటెక్ ట్రేడర్స్ ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణాల్లో, గోదాంలలో నిల్వ ఉన్న విత్తనాలు, ఎరువులను పరిశీలించారు. షాపుల్లో విత్తనాలు, మందుల లైసెన్స్‌లు, స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్కులు పరిశీలించారు. డీలర్లు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు రైతులకు విక్రయించాలని, ఎరువులను పీఓఎస్ మిషిన్ ద్వారానే అమ్మాలని తెలిపారు. అదే విధంగా రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేస్తున్నప్పుడు తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలని సూచించారు.

ఏవోగా కేంద్రే ఆకాశ్

కెరమెరి, జూన్ 28: ఏవో అధికారుల పరీక్ష ఫలితాలు విడుదల కాగా మండలానికి చెందిన కేంద్రే ఆకాశ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, మండల వాసులు హర్షం వ్యక్తం చేశారు. పలువురు ఆకాశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

30న మంత్రి సీతక్కరాక

కాగజ్‌నగర్, జూన్ 28: సిర్పూర్ నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించడానికి రాష్ట్ర మంత్రి సీతక్క ఈ నెల 30వ తేదీన వస్తున్నట్లు సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగజ్‌నగర్‌లోని అయుష్మాన్ ఆరోగ్య సబ్ సెంటర్లు, మర్కెట్ కమిటీ సమీపంలోని మిషన్ భగీరథ అర్బన్, రాంనగర్ విలేజ్ నంబర్ 12 ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, దహెగాం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రజలు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

మన ఊరు- మన బడి నిధులు మంజూరు చేయాలి

● మండల సర్వసభ్య సమావేశంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

మాట్లాడుతున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూన్ 28: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మన ఊరు -మన బడికి సంబంధించి పెండింగ్ నిధులు వెంటనే మంజూరు చేయాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. ఆసిఫాబాద్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మల్లికార్జున్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి జడ్పీటీసీ నాగేశ్వర్ రావు, సింగిల్‌విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్ తో కలిసి ఆమె హాజరయ్యారు. మండల స్థాయి అధికారులు నివేదికలను చదివి వినిపించారు. విద్యాశాఖ నివేదిక సందర్భంలో మన ఊరు -మన బడి పెండింగ్ నిధుల గురించి చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన ఊరు- మన బడి నిధులు పెండింగ్ ఉండగా ప్రస్తుతం అమ్మ ఆదర్శ పాఠశాల పేరుతో పనులు కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్ నిధులు ఇవ్వకుంటే కాంట్రాక్టర్ల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. పెండింగ్ నిధులు వెంటనే మంజూరు చేయాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. జడ్పీటీసీ నాగేశ్వర రావు మాట్లాడుతూ ఐదు సంవత్సరాల పరిపాలనలో సాధ్యమైనంత అభివృద్ధి చేశామని తెలిపారు. అయితే అధికారులు ప్రజాప్రతినిధులను ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని సూచించారు. ఎంపీపీ మల్లికార్జున్ మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్ మాట్లాడుతూ స్థానిక సంస్థల అభివృద్ధి గత పది సంవత్సరాల్లో ఎనలేనంతగా జరిగిందని అన్నారు. అనంతరం చివరి సమావేశం కావడంతో మండల పరిషత్ సభ్యులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీటీసీలు, మండల స్థాయి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పీవీ నరసింహారావు జయంతి వేడుకలు

కాగజ్‌నగర్: పీవీ నరసింహారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ప్రతినిధులు

కాగజ్‌నగర్, జూన్ 28: కాగజ్‌నగర్‌లోని సీనియర్ సిటిజన్ అసోసియేషన్ భవనంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో పీవీ నరసింహారావు జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, అసోసియేషన్ ప్రతినిధులు మూర్తి, నారాయణ, ఎల్లాగౌడ్, నాగేశ్వర్‌రావు, కోటేశ్వర్‌రావు, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

మందమర్రి, జూర్ 28: మందమర్రి పట్టణంలో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సొతుకు సుదర్శన్, నోముల ఉపేందర్‌గౌడ్. మంద తిరుమల్ రెడ్డి, రాచర్ల గణేశ్, ఎర్ర రాజు పాల్గొన్నారు.

మందమర్రి: పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

నూతన విద్యావిధానాన్ని అమలు చేయాలి

కౌటాల, జూన్ 28: అంగన్‌వాడీ టీచర్లు నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయాలని సిర్పూర్ ప్రాజెక్టు సీడీపీవో విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో ఆమె మాట్లాడారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో చైల్డ్ ఓల్డ్ కేర్, పిల్లల మెదడు అభివృద్ధి, పాటలు, ఆటలు, కథల గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లుగా సూపర్ వైజర్లు షకీర బేగం, కరుణ, సూపర్‌వైజర్లు పద్మ, శంకరమ్మ, షసీనా బేగం, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

వేమనపల్లి : విద్యార్థిని సన్మానిస్తున్న డీఈవో యాదయ్య, తదితరులు

వేమనపల్లి, జూన్ 28 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతిలో 9.5 జీపీఏ సాధించడం గొప్ప విషయమని డీఈవో యాదయ్య అన్నారు. శుక్రవారం నీల్వాయి రైతు వేదికలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ కనబర్చిన 12 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులను డీఈవో శాలువాలతో సన్మానించారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులతో పాటు ప్రమోషన్లు వచ్చిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సంతోష్‌కుమార్, హెచ్ఎంలు గిరిధర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సెక్టోరల్ అధికారి చౌదరి, ఎస్ఓ సత్యనారాయణ మూర్తి, ఎఫ్ఓ రాజ్‌కుమార్, మండల నాయకులు గాలి మధు, సాబీర్‌అలీ, సమ్మయ్య, సుబ్బారావు, వెంకటేశ్వర్లు , ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

కోటపల్లి, జూన్ 28 : ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని మంచిర్యాల జిల్లా అధికారి యాదయ్య సూచించారు. కోటపల్లి మండలం మల్లంపేట ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విధులకు సమయానికి హాజరుకాని ఇద్దరు ఉపాధ్యాయులకు గైర్హాజరు వేశారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. పాఠశాలకు విద్యార్థులు గైర్హాజరు కాకుండా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. డీఈవో వెంట సెక్టోరియల్ అధికారి చౌదరి ఉన్నారు.

వారసంతలకు వేలం

కౌటాల, జూన్ 28: కౌటాల గ్రామ పంచాయతీ పరిధిలో 2024-25 సంవత్సరానికి గాను ప్రతి సోమవారం నిర్వహించే పశువుల, కూరగాయల సంతకు శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. పశువుల సంతకు మండల కేంద్రానికి చెందిన నెర్పల్లి అర్జున్ రూ.11లక్షలు, కూరగాయల సంతకు మండల కేంద్రానికి ఆత్రం ఉమేశ్ రూ. 4.2లక్షలకు వేలం పాటలో గెలుచుకున్నారు. ఈ వేలం పాటలో ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, ఎంపీవో మహేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుబ్బ సాయికృష్ణ, పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి, జూన్ 28 : మండల కేంద్రంలో ప్రతి బుధవారం నిర్వహించే కూరగాయలు వారసంతకు వేలంపాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఆపిష్ అలీ ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 1వ తేదీన ఉదయం 11 గంటలకు చింతలమానేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేకాధికారి, ఎంపీడీవో కోట ప్రసాద్ అధ్యక్షతన వేలం పాట నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గలవారు 20 వేల రూపాయలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని సూచించారు. వేలం పాటలో పాల్గొనే వారు సెల్ నంబర్ 9912212147ను సంప్రదించాలని సూచించారు.

రాజకీయ నాయకులతోనే ఉద్యోగుల విధులకు ఆటంకం

ఉద్యోగ విరమణ పొందిన కార్మికులతో మున్సిపల్ చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు, ఉద్యోగులు

మంచిర్యాలటౌన్, జూన్ 28: రాజకీయ నాయకుల జోక్యంతోనే ఉద్యోగులు సక్రమంగా పని చేయలేకపోతున్నారని మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య అన్నారు. శుక్రవారం మంచిర్యాల మున్సిపాలిటీలో నీటి సరఫరా విభాగంలో పని చేసే పెర్క ఎల్లయ్య, పారిశుధ్య విభాగంలో పని చేస్తున్న కోకిల రాజం, దర్శనాల శంకర్ ఉద్యోగ విరమణ పొందారు. ఈ ముగ్గురిని మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, కమిషనర్ మారుతిప్రసాద్, వైస్ చైర్మన్ మహేశ్, అధికారులు, కుటుంబ సభ్యులు, తోటి ఉద్యోగులు పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీర్ మధుకర్, ఏఈ రాజేందర్, మేనేజర్ విజయ్‌కుమార్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ రాథోడ్ సునీల్, సిబ్బంది, మున్సిపల్ కౌన్సిలర్లు, ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడి జన్మదిన వేడుకలు

జన్మదినం జరుపుకుంటున్న లక్ష్మీనారాయణతో కుటుంబ సభ్యులు

మంచిర్యాలటౌన్, జూన్ 28: శతాధిక వృద్ధుడి జన్మదిన వేడుకలను శుక్రవారం ఆయన కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. మంచిర్యాల పట్టణం చింతపండు వాడకు చెందిన పుల్లూరి లక్ష్మీనారాయణ గుప్తా(101)సంవత్సరాలు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు. వ్యవసాయంతో పాటు కిరాణా షాపును నడిపించే వారు. ఇద్దరు కూతుళ్లకు పెండ్లిళ్లు చేశారు. ప్రస్తుతం ఆయనకు 12 మంది మనుమలు, మనుమరాళ్లు, మునిమనుమలు ఉన్నారు. వీరందరి సమక్షంలో లక్ష్మీనారాయణ 101వ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. కుటుంబ సభ్యులు పాదపూజ, హారతి కార్యక్రమాలు నిర్వహించారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలివ్వాలి

● దండేపల్లిలో సీపీఐ ఆధ్వర్యంలో భూపోరాటం
● నాలుగెకరాలు ఆక్రమణ..● చీరెలతో తాత్కాలిక హద్దులు

చీరలతో తాత్కాలిక హద్దులు ఏర్పాటు చేసుకున్న గ్రామస్తులు

దండేపల్లి, జూన్ 28 : అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలివ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం దండేపల్లి మండల కేంద్రంలో భూ పోరాటం చేశారు. మండల కేంద్రంలోని ఓ రైతుకు చెందిన నాలుగున్నర ఎకరాల వ్యవసాయ భూమిని సీపీఐ ఆధ్వర్యంలో గురువారం రాత్రి గ్రామానికి చెందిన నిరుపేదలు ఆక్రమించుకున్నారు. ఎవరికి వారే చీరెలతో తాత్కాలిక హద్దులు ఏర్పాటు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న దండేపల్లి, జన్నారం, లక్షెట్టిపేట ఎస్ఐలు ఘటనా స్థలానికి చేరుకొన్నారు. సీపీఐ నాయకులతో పాటు భూమిని ఆక్రమించుకొన్న పేదలతో చర్చలు జరిపారు. ఇది రైతుకు చెందిన వ్యవసాయ పట్టా భూమి అని, దీనిని ఆక్రమించుకోవడం సరికాదన్నారు. ఖాళీ చేయకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీంతో పేదలు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం సీపీఐ మండల కార్యదర్శి పెర్క రాజేశ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ సంధ్యారాణికి వినతి పత్రం అందించారు. అర్హులైన నిరుపేదలందరికీ ప్రభుత్వం ఇండ్ల స్థలాలు కొనుగోలు చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నాటుసారా స్థావరాలపై దాడి

పెంచికల్ పేట్, జూన్ 28 : చేడువాయి గ్రామంలో నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. 10 లీటర్ల నాటుసారాను స్వాధీన పరుచుకొని నిందుతునిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు.

అక్రమ పట్టాలను రద్దు చేయాలి

మాట్లాడుతున్న సీపీఐం రాష్ట్ర నాయకులు ఆశయ్య, మిల్క్ వాసుదేవ రెడ్డి

చెన్నూర్ రూరల్, జూన్ 28 : సీపీఐం ఆధ్వర్యంలో పేదలు వేసుకున్న గుడిసెలను గురువారం ఉదయం భూకబ్జాదారులు తొలగించడం, వారిపై దాడి చేయడం దారుణమని సీపీఐం రాష్ట్ర నాయకులు పైళ్ల ఆశయ్య, మిల్క్ వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు. చెన్నూర్ మండలం బావురావుపేట గ్రామ శివారులోని గుడిసె కేంద్రాలను శుక్రవారం వారు సందర్శించి మాట్లాడారు. సర్వే నంబర్ 8లోని ప్రభుత్వ అసైన్డ్ భూమిలో రెండేళ్లుగా ఇండ్లులేని నిరుపేదలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారని వారు తెలిపారు. గుడిసెలను భూకబ్జాదారులు ధ్వంసం చేసి, ఇంట్లో ఉన్న గిరిజన, ఆదివాసీ మహిళలపై దుర్భాషలాడారని చెప్పారు. ఈ దాడులను సీపీఐం తీవ్రంగా ఖండిస్తున్నదని, కలెక్టర్, చెన్నూర్ ఎమ్మెల్యే, పోలీస్ అధికారులు, తహసీల్దార్, సంబంధిత అధికారులు స్పందించి పేదలకు పట్టాలివ్వాలని, వారికి రక్షణ కల్పించాలని కోరారు. దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని, అక్రమ పట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐం జిల్లా కార్యదర్శి సంకె రవి, కార్యదర్శివర్గ సభ్యులు ప్రకాశ్, జిల్లా కమిటీ సభ్యులు చందు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి డుర్కె మోహన్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అరిగెల మహేశ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అభినవ్, రవి, చారి, కరీమా, ఉమారాణి, సమ్మక్క, సరిత, కుమార్, రమాదేవి, సీపీఐం నాయకులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీలు

భీమారం, జూన్ 28: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీని డీఆర్డీవో కిషన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆదివాసీ మోదుగు ఆకు విస్తారకుల తయారీ కేంద్రాన్ని, పోతన్‌పల్లిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంపీడీవో రాధ రాథోడ్, మండల పంచాయతీ అధికారి శ్రీపతిబాపు, ఈసీ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి వేముల శ్రీనివాస్ ఉన్నారు.

అల్లం వారి కుంట శిఖం భూమిని కాపాడాలి

జన్నారం, జూన్ 28 : రేండ్లగూడ గ్రామంలోని అల్లం వారి కుంట సర్వే నంబర్ 160, 161లో 24 ఎకరాల చెరువు భూమిని ఆక్రమించుకొని కొందరు పంటలు సాగుచేస్తూ వారి నుంచి అట్టి భూమిని రక్షించాలని అదే గ్రామానికి చెందిన అల్ల పెద్దయ్య, తిరుపతి శుక్రవారం తహసీల్ కార్యాలయంలో డీటీ రాంమోహన్‌రావు వినతి పత్రం అందజేశారు. అ పంట పొలంలో ఆరు బావు లు తవ్వి విద్యుత్ మోటర్లు అమర్చి నీటిని వాడుకోవడంతో చెరువులో నీరు లేక పశువులు, గ్రామంలోని బావుల్లో నీరు అడుగంటిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే అక్రమంగా చెరువుని ఆక్రమించుకున్నా వారి నుంచి భూమి స్వాధీనం చేసుకొని చెరువును కాపాడాలని కోరారు.

అధికంగా ఫీజు వసూలు చేస్తున్న ఐటీఐ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

నస్పూర్, జూన్ 28 : పరీక్ష ఫీజులు అధికంగా వసూలు చేస్తున్న ప్రైవేట్ ఐటీఐ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక నాయకులు శుక్రవారం జిల్లా కన్వీనర్ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వేదిక రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలోని శక్తి, శ్రీసాయి, సెయింట్ లూయిస్, ఆల్‌బర్ట్, డింపి ఐటీఐ కళాశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు రూ. 213 , సప్లిమెంటరీ విద్యార్థులకు రూ.510 ఉంటే ప్రైవేట్ ఐటీఐలు మాత్రం రూ. 1500 నుంచి 2 వేల వరకు వసూలు చేస్తూ విద్యార్థులను దోచుకుంటున్నారన్నారు. వెంటనే అధిక ఫీజులు వసూలు చేస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇక్కడ నాయకులు రమేశ్, ప్రశాంత్, రాకేశ్, సాయి ఉన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

కోటపల్లి, జూన్ 28 : ఎసన్నాయి గ్రామంలో ఎంపీపీ నిధుల నుంచి ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను కోటపల్లి ఎంపీపీ మంత్రి సురేఖ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సీమా నాయక్ పాల్గొన్నారు.

ఫీజుల నియంత్రణ కమిటీ నియమించాలి

సీసీసీ నస్పూర్, జూన్ 28: ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడిని అరికట్టడానికి నియంత్రణ కమిటీలను నియమించాలని మాదిగ స్టూడెంట్ ఫోరం మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జి కోండ్ర ఉదయ్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీసీసీ నస్పూర్‌లోని ఎంఎస్ఎఫ్ కార్యాలయంలో ఏర్పాట